BHARATH SAMACHAR DIGITAL

8, జులై 2026, బుధవారం భారత్ సమాచార్

ఘనంగా శీత్ల పండుగ దాటుడు ఉత్సవాలు



భారత్ సమాచార్, నల్గొండ జిల్లా: దామరచర్ల మండలం బాలాజీ నగర్ తండలో శీత్ల (సీత్ల) పండుగ దాటుడు ఉత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు సంప్రదాయ ఆచారాలు, ఆనవాయితీలను పాటిస్తూ శీత్ల మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ వేడుకల్లో గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు, యువత, చిన్నారులు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

దాటుడు కార్యక్రమం సందర్భంగా గ్రామస్తులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శీత్ల మాత అనుగ్రహంతో గ్రామంలో సుఖశాంతులు నెలకొనాలని, ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని భక్తులు ప్రార్థించారు. గ్రామ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామమంతా భక్తి, ఐక్యత, ఆనందోత్సాహాలతో కళకళలాడింది.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాధరమణ వాంకుడోత్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో కలిసి శీత్ల పండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామ సంప్రదాయాలను, సంస్కృతిని భావితరాలకు అందించేందుకు ఇలాంటి ఉత్సవాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. శీత్ల మాత ఆశీస్సులతో గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు నెలకొనాలని ఆకాంక్షించారు.

ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు, చిన్నారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాల నిర్వహణలో గ్రామస్థులందరూ సమిష్టిగా సహకరించడంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. శీత్ల పండుగ సందర్భంగా నిర్వహించిన దాటుడు ఉత్సవాలు గ్రామ ప్రజల ఐక్యత, సంప్రదాయాల పట్ల ఉన్న గౌరవాన్ని ప్రతిబింబించాయని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

© 2026 Bharath Samachar